## క్లుప్తంగా

### ప్రతీ గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

**కుల్కచర్ల:** ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటుచేయాలని కుల్కచరల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండల పరిషత్‌లో 4,40,000 మొక్కలను పెంచేందుకు జిల్లా అధికారులు టార్గెట్ ఇచ్చారని పంచాయతీ కార్యదర్శులు మొక్కల పెరుగుదలకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

### ఘనంగా మైసమ్మ విగ్రహం ఊరేగింపు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

**యాలాల:** దౌలాపూర్ శివారులోని రక్త మైసమ్మ విగ్రహ ఊరేగింపు బుధవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆలయం వరకు భక్తులు డప్పువాయిద్యాలతో తీసుకువెళ్లారు. రక్త మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆంజనేయస్వామి ఆలయం నుంచి మైసమ్మ విగ్రహం, ఆలయ కలశాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం గణపతి పూజ, పుణ్యావచనము, గౌరి పూజ, లక్ష్మీపూజ, నవగ్రహ పూజ తదితర క్రతువులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు.

### పరిగి డిగ్రీ కళాశాల విద్యార్థినికి రజత పతకం



రజత పతకంతో రమణి

**పరిగి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పరిగి విద్యార్థిని ద్వితీయ బహుమతి గెల్చుకుంది. పరిగి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న రమణి మహిళల విభాగంలో జావలిన్ త్రోలో రజత పతకం సాధించింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ సునీత పద్మావతి విద్యార్థిని అభినందించారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎంపీడీఓ కరీం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కరీం

**పరిగి:** గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కరీం సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులతో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. అన్ని వార్డుల్లో తాగునీరు సరఫరా అవుతుందా? లేదా? అనే విషయాలను తెలుసుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ప్రతి గ్రామంలో 8,800 మొక్కలు నాటే విధంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనుల గురించి వివరించి రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉషీ, ఈసీ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

**కుల్కచర్ల:** ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం అయిన బండవెల్కిచర్ల ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గౌడ్‌కు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, మండల ఎంపీడీఓ అధికారులు రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

- సీఎం ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్ర
- కాంగ్రెస్ కొడంగల్ ఇంచార్జి తిరుపతిరెడ్డి



దుద్యాల్: మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

**అనంతగిరి:** ప్రతిఒక్కరూ దాడులను ఖండించాల్సిన అవసరం ఉందని కొడంగల్ కాంగ్రెస్ ఇంచార్జి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదన్నారు. బుధవారం ఆయన తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చి జరిగిన ఘటన గురించి కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం బయటకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసాంఘిక శక్తులు ఈ దాడిలో పనిచేశాయన్నారు. సీఎం తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునేక్రమంలో కొన్ని అసాంఘిక శక్తులు సీఎం ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి పూనుకున్నారని, ఏ శక్తి ఎన్నికుట్రలు చేసినా, కుతంత్రాలు చేసినా అభివృద్ధిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవడం కేటీఆర్, హరీష్‌రావులకు తగదన్నారు. భూసేకరణ కోసం అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రశాంత వాతావరణంలో చేపడుతుందన్నారు. ముందస్తుగా అనుకున్న పథకం ప్రకారమే అధికారులను గ్రామంలోకి తీసుకెళ్లి దాడి చేయించారన్నారు. దాడులు చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎవరు కూడా భయపడరని, కొడంగల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పిన వారిని ఎట్టిపరిస్థితిలో వదలబోమన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**యువలకును ఉసిగొల్పడం బాధాకరం**

**దుద్యాల్:** కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్, హరీశ్‌రావ్‌లు కలిసి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని కొడంగల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని లగచెర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం లగచెర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడి చాలా బాధాకరమన్నారు. కొడంగల్ ప్రాంతాన్ని గత పాలకులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధికి విద్యావ్యవస్థలు, కంపనీలు నెలకొల్పి ఇక్కడి ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా పనులు చేస్తుంటే కొంత మంది బీఆర్ఎస్ నాయకులు మాత్రం అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుద్యాల్ మండలంలోని లగచెర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో కొంత మంది యువకులను బీఆర్ఎస్ నాయకులు ఉసిగొలిపి దాడులకు పాల్పడేల చేస్తున్నారన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఇక్కడ ఫార్మా కంపనీ నెలకొల్పి తీరుతామని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉన్నామన్నారు. ఫార్మా కంపనీ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయే రైతులు అధికారులకు తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. ఇంకా ఏమైనా డిమాండ్లు ఉంటే వెంటనే అధికారులను కలిసి మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారబాద్, నారాయణపేట్ జిల్లాల గ్రథాలయ సంస్థల ఛైర్మన్‌లు రాజేశ్ రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, కొడంగల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీరాంరెడ్డి, నందారం ప్రశాంత్, రఘువర్ధన్ రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, నయిమ్, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**దోమ:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దోమ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండలం గుండాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతీ గింజను కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, బంగ్ల యాదయ్య, రమేష్ గౌడ్, రాంచంద్రారెడ్డి, మల్‌రెడ్డి, శ్రీను, రఘునాథ్ రెడ్డి, అయిల్ రెడ్డి, మాల వెంకటయ్య, మాల శ్రీను, అంజిలప్ప, దస్తయ్య, జి.గోపాల్ రెడ్డి, నార్యనాయక్ పాల్గొన్నారు.

**ధారూరులో...**

**ధారూరు:** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, హరిదాస్‌పల్లి సొసైటీ ఛైర్మన్ వెంకట్‌రెడ్డితో కలిసి గట్టెపల్లి గ్రామంలో బుధవారం ఆయన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్ణీత తేమశాతం ఉండేలా చూసుకోవాలని, తూకం సరిగ్గా వేస్తున్నారా? లేదా? గమనించాలని ఆయన రైతులకు సూచించారు. ఏమైన ఇబ్బందులు కలిగితే తమ దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ లింగనపల్లి అశోక్ ముదిరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.రాములు, ఏఎంసీ డైరెక్టర్లు అమరేశ్వర్‌రావు, రవీందర్, వాణిశ్రీ, సొసైటీ సీఈఓ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బాబాఖాన్, డి.రాజేందర్, రమేశ్‌కృష్ణ, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ధారూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



దోమ: వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

# కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



పెద్దేముల్‌లో సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు



బంట్వారం: తొర్మామిడిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు



నవాబుపేట: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అనురాధ



దోమ: రత్నానాయక్ తండాలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేష్ బాబు

**పెద్దేముల్:** మండలంలోని పెద్దేముల్, బుద్దారం, గోపాల్‌పూర్, మంబాపూర్, కందనెల్లితో పాటు పలు గ్రామాల్లో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. సర్వే సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలన్నింటిని సక్రమంగా నమోదు చేయాలని మండల అధికాలరులు ఎన్యుమరేటర్లను ఆదేశిస్తున్నారు. రెండు రోజుల నుంచి సర్వే ఫారాలు సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎన్యుమరేటర్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జర్నప్పను వివరణ కోరగా ఫారాల సమస్య లేదన్నారు.

**బంట్వారంలో..**

**బంట్వారం:** ఇంటింటి కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని తొర్మామిడి, బస్వాపూర్ గ్రామాలను సందర్శించి సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వేనిర్వహించే క్రమంలో ఏ ఇంటికైనా లాక్ ఉంటే ఎన్యూమరేటర్లు మళ్లీ ఆ ఇంటిని సందర్శించి వివరాలు తీసుకోవాలన్నారు.

**దోమలో..**

**దోమ:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కుల గణన నిర్వహించాలని దోమ ఎంపీడీఓ మహేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం బొంపల్లి అనుబంధ గ్రామం రత్నానాయక్ తండాలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడ కూడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

**నవాబుపేటలో...**

**నవాబుపేట:** ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. మండల పరిధిలోని యావపూర్ గ్రామంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విజయ్ కుమార్, సూపరింటెండెంట్ అజియ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**కొడంగల్:** ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డును తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఏమైనా కంటి సమస్య నిర్ధారణఅయితే వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు.

### స్నేహితుడి కుటుంబానికి చేయూత

**కుల్కచర్ల:** చౌడాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పరిగి ప్రేంకుమార్ రెండు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ప్రస్తుతం అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు మాధవి కుటుంబానికి అండగా నిలిచారు. పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి ఆధ్వర్యంలో తక్షణ సహాయంగా రూ. 10వేలు అందజేశారు. బి.వెంకటేష్, ఎస్.మాసయ్య, కె.గోపాల్, సంజు, సత్యయ్య, శంకరయ్య, అంజి, మొగులయ్య, నరేష్ పాల్గొన్నారు.

### విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

**చేవెళ్ల:** విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే గ్రామాల అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కందవాడ మాజీ ఉపసర్పంచ్ జి.కావ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్‌లు అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రరీకి బుధవారం కావ్య, కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ సహకారంతో 20వేల పుస్తకాలను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు రీడింగ్ అలవాటు చేసేందుకు లైబ్రరీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## బార్‌దాన్ సంచులు పంపిణీ



పెద్దేముల్ మండల మంబాపూర్ సెంటర్‌కు వచ్చిన బార్‌దాన్ సంచులు

సాక్షి ఎఫెక్ట్..

'కిలో తూకం వేస్తే ఒట్టు'అనే శీర్షికతో బుధవారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు డీసీఎంఎస్ అధికారులు స్పందించారు. పెద్దేముల్ మండల మంబాపూర్, జనగాం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 10వేల సంచులను పంపిణీ చేశారు. మంబాపూర్ సెంటర్‌కు 6వేలు, జనగాం సెంటర్‌కు 4వేల సంచులు పంపిణీ చేసినట్లు డీసీఎంఎస్ అధికారులు తెలిపారు. – పెద్దేముల్

# అక్రమ కేసులను ఎత్తివేయాలి

బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్



మాట్లాడుతున్న గట్యానాయక్

**పరిగి:** ఫార్మా రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతుల జీవనాధారమైన భూములను లాక్కోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల నుంచి భూములు లాక్కొని ప్రైవేటు కంపనీలకు విక్రయించి లాభాలను పొందేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. రైతులు తమ భూములను వదులుకోలేక తమ ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ఆవేదనతో అధికారులతో మాట్లాడుతున్నక్రమంలో దాడులు జరగటం బాధాకరమన్నారు. ఈ ఘటనలో రైతులను బాధ్యులుగా చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడిఘటనలో ప్రమేయం లేని రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవింద్ నాయక్, హరినాయక్, రవీందర్ పాల్గొన్నారు.

### భయంవీడి చదువుకోవాలి

వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరాం



మాట్లాడుతున్న డాక్టర్ బీవీ పట్టాభిరాం

**మోమిన్‌పేట్:** విద్యార్థులు భయంవీడి చదువుకుంటే మంచి ఫలితాలు వస్తాయని డాక్టర్ బీవీ పట్టాభిరాం వ్యక్తిత్వ వికాస నిపుణుడు పేర్కొన్నారు. మోమిన్‌పేట్ మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. మండలంలోని పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. విద్యార్థులు పదిలో ఏవిధమైన మెళకువలు పాటిస్తే ఉత్తీర్ణత సాధించవచ్చనే విషయాలను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి



సరుకులను పరిశీలిస్తున్న భాస్కర్ గౌడ్

**కుల్కచర్ల:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కుల్కచర్ల ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: తులసీ పూజలో మహిళలు



అనంతగిరి ఆలయంలో తులసీ వివాహం

### ఘనంగా తులసీ కల్యాణం

**అనంతగిరి:** వికారాబాద్ సమీపంలోని అనంతగిరిగుట్ట అనంతపద్మనాభస్వామి ఆలయంలో, తాండూరు ఆలయంలో కార్తీకమాస పెద్ద జాతరలో భాగంగా బుధవారం రాత్రి తులసీ వివాహాన్ని ఆలయ ట్రస్టీ పద్మనాభం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మండల పశువైద్యురాలు శిరీష



పశువులను పరిశీలిస్తున్న వైద్యులు

**చేవెళ్ల:** పాడిపశువులను రైతులు జాగ్రత్తగా కాపాడుకోవాలని, వాటికి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యురాలు శిరీష, పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ జయసుధ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల వద్ద ఉన్న పాడిపశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భకోశ సంబంధించిన వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించి అవసరమైన పశువులకు చికిత్స చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాడిపశువుల అభివృద్ధితో ప్రజలకు ఆదనపు ఆదాయం సమకూరుతుందని, వ్యాధులపై జాగ్రత్తలు తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. సీజనల్‌గా పశువుల్లో వచ్చే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడూ పశువులను గమనిస్తూ వాటిలో వచ్చే తేడాలను గుర్తించి వ్యాధులను నిర్ధారించుకోవాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.